AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

క్రీడా మైదానం ప్రారంభం

2

2

వార్డు అభ్యర్థుల సందడి

జొన్న పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

అక్షరటుడే, గాంధారి: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం జిల్లా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు కలిసి జొన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జొన్న కంకిలో గింజలు ఏర్పడకపోవడం వంటి సమస్యలు ఉన్న చేన్లను రైతులతో కలిసి పరిశీలన జరిపారు. జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్లారెడ్డి సుధా మధుర తదితరులు గుజ్జుల్, చిన్న గుజ్జుల్, దుర్గం, పిస్కుల్‌గుట్ట తండాలను పరిశీలించారు.

కేటీఆర్‌తో మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, షకీల్ భేటీ

అక్షరటుడే, ఆర్మూర్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని కేటీఆర్ నివాసంలో సోమవారం ఆయనతో సమావేశయ్యారు. ఈ సందర్భంగా సిట్ విచారణల పేరుతో పార్టీ నేతలపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు, మున్సిపాలిటీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు తదితర అంశాలపై చర్చించారు. నిజామాబాద్ జిల్లాలో తాజా రాజకీయ పరిస్థితులపై కేటీఆర్.. జీవన్ రెడ్డితో మాట్లాడి చర్చించారు.

4వ తేదీ నుంచి వేంకటేశ్వరాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

అక్షరటుడే, ఆర్మూర్: మాక్లూర్ మండలం గుత్ప గ్రామంలోని అపురూప వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 4 నుంచి 7 వరకు 14వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా 4న అంకురార్పణతో శ్రీవారి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 5న శ్రీవారి యాగశాల ప్రవేశం, ధ్వజారోహణం, శ్రీవారి శేష వాహన సేవ, ఎదుర్కోలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 6న నిత్య హోమం, బలిహరణం, శ్రీవారి కల్యాణోత్సవం, శ్రీవారి గరుడ సేవ జరగనున్నాయి. 7న సుదర్శన నరసింహ హోమం, చక్రతీర్థం, చక్ర స్నానం అనంతరం సాయంత్రం దేవతో ద్వాసనం కార్యక్రమం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఈ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

సోమేశ్వరంలో మద్యపాన నిషేధానికి ఏకగ్రీవ తీర్మానం

అక్షరటుడే, బాన్సువాడ: మండలంలోని సోమేశ్వరం గ్రామంలో మద్యపానాన్ని పూర్తిగా నిషేధిస్తూ గ్రామ పెద్దలు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మద్యానికి బానిసై యువత ప్రాణాలు కోల్పోతుండడం, గ్రామంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతుండడంపై ఆందోళన వ్యక్తం చేసిన పెద్దలు, గ్రామాభివృద్ధి దృష్ట్యా ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామ పరిధిలో ఉన్న బెల్ట్ దుకాణాల్లో మద్యం విక్రయాలు పూర్తిగా నిలిపివేయాలని నిర్ణయించారు. నిషేధాన్ని ఉల్లంఘించి మద్యం విక్రయాలు జరిపితే సంబంధిత వ్యక్తులపై రూ.లక్ష జరిమానా విధిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని మద్యపాన రహిత గ్రామంగా సోమేశ్వరాన్ని తీర్చిదిద్దాలని సంకల్పించారు.

జిల్లాలో మున్సిపల్ ఎన్నికల సందడి నెలకొంది. నామినేషన్ల పర్వం ముగియడంతో అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికి తిరుగుతూ ఓట్లు అడుగుతున్నారు. తమను గెలిపించాలని వేడుకుంటున్నారు. నిజామాబాద్ నగరంలో బీజేపీ, ఎంఐఎం అభ్యర్థులు ఖరారు కావడంతో.. వారు ప్రచారంలో దూసుకు పోతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఇంకా బీ ఫామ్‌లు అందించక పోవడంతో ఆశావహులు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

- అక్షరటుడే, ఇందూరు

ప్రచారం ఘరూ..

- పుర'పోరు'లో బీజేపీ, ఎంఐఎం అభ్యర్థుల జోరు
- ఇంటింటికి వెళ్తూ ఓట్లు అడుగుతున్న నేతలు
- నగరపాలక సంస్థపై అన్ని పార్టీల ఫోకస్

జిల్లాలో నిజామాబాద్ నగరపాలక సంస్థతో పాటు, ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగనున్నాయి. జిల్లావ్యాప్తంగా ఆయా రాజకీయ పార్టీలకు చెందిన వారితో పాటు స్వతంత్రులు మొత్తం 1,729 నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే ఇందులో అత్యధికంగా కాంగ్రెస్, బీజేపీల నుంచి ఆశావహులు నామినేషన్లను దాఖలు చేశారు. ఇప్పటికే బీజేపీ నగరపాలక సంస్థ అభ్యర్థులను ప్రకటించింది. దీంతో సీటు ఖరారు కానీ వారు నామినేషన్ ఉపసంహరించుకునే అవకాశం ఉంది. పార్టీ నేతలు కూడా రెబల్స్‌ను బుజ్జగించే ప్రయత్నంలో ఉన్నారు. అలాగే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఇంకా అభ్యర్థులకు బీఫాంలు ఇవ్వలేదు. ఈ రోజో రేపో అధికారికంగా ప్రకటిస్తున్నట్లు సమాచారం.

అభివృద్ధి చేస్తాం

నగర పాలక సంస్థలో బీజేపీ, ఎంఐఎం అభ్యర్థులను పార్టీ జిల్లా కమిటీ ప్రకటించింది. బీజేపీ నుంచి 50 డివిజన్లలో అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈ సారి మూడు డివిజన్లలో ఆ పార్టీ ముస్లింలకు టికెట్లు ఇచ్చింది. అలాగే ఎంఐఎం 21 డివిజన్లలో అభ్యర్థులను ప్రకటించింది. దీంతో వీరు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ప్రతి ఇంటికి వెళ్తూ తమకు ఓటేయాల్సిందిగా కోరుతున్నారు. తమకు గెలిపిస్తే చేసే అభివృద్ధి పనులను ఓటర్ల ముందుంచుతున్నారు. అలాగే సోషల్ మీడియాలో, డివిజన్ వాట్సాప్ గ్రూపులోనూ ప్రచారం చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో బీ ఫామ్ ఇవ్వకపోవడంతో ప్రచారం మొదలు కాలేదు. తమకు సీటు ఖరారవుతుందనే ధీమా ఉన్న అభ్యర్థులు మాత్రం ప్రచారంతో ముందుకు సాగుతున్నారు. కాలనీలలో పెద్దలను కలుస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు.

మున్సిపాలిటీల్లోనూ అంతే..

ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ మున్సిపాలిటీలో ఇప్పటివరకు ఏ రాజకీయ పార్టీ కూడా అభ్యర్థులను ప్రకటించలేదు. దీంతో ప్రచారం ఊపందుకోలేదు. కానీ సీటు వస్తుందనే నమ్మకంతో ఉన్నవారు మాత్రం ప్రచారం ప్రారంభించారు. అయితే ఈ రోజు రాత్రి వరకు దాదాపు అన్ని రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించి బీ ఫామ్‌లను అందజేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే నామినేషన్‌ల ఉపసంహరణకు ఒక్కరోజు సమయం మాత్రమే ఉంది.

డిజిటల్ ప్రచారం...

ఎన్నికల ప్రచారం జనాల్లోకి ఎంతగా వెళితే అభ్యర్థులకు అంతగా లాభం ఉంటుంది. గతంలో మాదిరిగా ఫ్లెక్సీలు, బ్యానర్లు, పాంప్లెట్‌లతో పాటు అభ్యర్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. ప్రధానంగా సినిమా పాటలకు వీడియోలు, వాట్సాప్ స్టేటస్‌ల వినియోగం, వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో ఫోన్ ఉండడం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల్లో ప్రచారం చేస్తున్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం

అక్షరటుడే, మెండోరా: మండలంలోని పోచంపాడ్‌లో ఉన్న తెలంగాణ రెసిడెన్షియల్ బాయ్స్ స్కూల్‌లో గంజాయి, సిగరెట్లు తదితర మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెండోరా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మెండోరా ఎస్సై సుహాసిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తాయని హెచ్చరించారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

తిమ్మాపూర్‌లో ఉపాధి హామీ పనులు ప్రారంభం

అక్షరటుడే, గాంధారి: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పనులు సోమవారం సర్పంచ్ శంకర్, ఉపసర్పంచ్ సౌందర్య వార్డ్ మెంబర్లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను ప్రజలందరూ ఉపయోగించుకోవాలన్నారు. అంతేకాకుండా ఎవరికైనా ఉపాధి హామీ కార్డులు లేకపోతే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కారోబార్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రెంజర్లలో ఎస్‌బీఐ బ్రాంచ్ ప్రారంభం

అక్షరటుడే ముప్కాల్: రెంజర్ల గ్రామంలో ఎస్‌బీఐ నూతన శాఖను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి రీజినల్ మేనేజర్ మహేశ్వర్, బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్, గ్రామ సర్పంచ్ లావణ్య భూమేశ్వర్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. గ్రామంలో బ్యాంకు ప్రారంభంతో రైతులు, స్వయం సహాయక సంఘాలు, సాధారణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు సులభంగా అందుబాటులోకి రానున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఏపీఎం, గ్రామపెద్దలు గంగారెడ్డి, మచ్చర్ల నారాయణ, వీడీసీ సభ్యులు, స్థానికులు హాజరయ్యారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్: ఎస్పీ రాజేష్ చంద్ర

అక్షరటుడే, కామారెడ్డి: తాళాలు వేసిన ఇళ్లు, షట్టర్లను టార్గెట్ చేస్తూ చోరీ పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎస్పీ రాజేష్ చంద్ర వివరాలు వెల్లడించారు. గతనెల 2న అశోక్ నగర్ కాలనీలో జరిగిన చోరీకి సంబంధించి బాధితుడు మాలోత్ బాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. ఈ క్రమంలో నెల్లూరు జిల్లా వేదాయ పాలెంకు చెందిన చిల్లకూరి కృష్ణారెడ్డి అలియాస్ చండి కృష్ణను పోలీసులు గతనెల 9న అరెస్ట్ చేశారు. ఈ కేసులో తప్పించుకుని తిరుగుతున్న మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఇబ్రహీంబాద్‌కు చెందిన మూడవత్ అంజియా, యాప్రాల్‌కు చెందిన సత్యనారాయణ (దొంగసొత్తు కొనుగోలు చేసిన వ్యక్తి)లను సిరిసిల్ల బైపాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు పట్టుకున్నారు. వీరిద్దరూ కృష్ణారెడ్డి, గొడుగు ప్రభాకర్‌లతో కలిసి తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్నట్టు తేలింది. చోరీల

కోసం బైకును చోరీచేసి నంబర్ ప్లేట్ మార్చి వినియోగిస్తున్న విషయంలో జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైనట్లు ఎస్పీ వెల్లడించారు. దొంగిలించిన బంగారు, వెండి ఆభరణాలను ముతూట్ ఫైనాన్స్‌లో తనఖా పెట్టారు. సమావేశంలో కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పట్టణ సీఐ నరహరి పాల్గొన్నారు.

రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి: ఎన్నికల పరిశీలకులు

అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి జిల్లాలో పోలింగ్ సిబ్బందికి రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై మాస్టర్ ట్రైనర్స్ ద్వారా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ తరగతులు ఈనెల 4వ తేదీన నాలుగు మున్సిపాలిటీల్లో నిర్వహించబడతాయని, అలాగే పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియ 10న ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. బాన్సువాడ మున్సిపాలిటీకి సంబంధించి మున్సిపల్ కార్యాలయంలో శిక్షణ కేంద్రం, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని దేశాయిపేటలోని ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కామారెడ్డి మున్సిపాలిటీకి సంబంధించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ కేంద్రం, ఎస్పీ కార్యాలయ సమీపంలోని మార్కెట్ కమిటీ గోడౌన్‌లో ఏర్పాటు చేసినట్లు వివరించారు. బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ కేంద్రం, వ్యవసాయ మార్కెట్ యార్డులో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఎల్లారెడ్డి మున్సిపాలిటీకి సంబంధించి ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కేంద్రం, ప్రభుత్వ డిగ్రీ కళాశా

లలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఎన్నికల నిర్వహణకు మొత్తం 1,195 మంది పోలింగ్ సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో 239 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 239 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ల, 645 మంది ఓపీవోలు ఉంటారని, అదనంగా 1,398 మంది రిజర్వ్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్, సీపీవో రఘునందన్, ఎస్‌వో శివకుకర్, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో పోటీ చేసేందుకు.. కన్నకూతురిని చంపిన కిరాతకుడు

అక్షరటుడే, బోధన్: ఎన్నికల్లో పోటీ చేసేందుకు చివరికి కన్న కూతురినే హతమార్చాడు ఓ కిరాతక తండ్రి. ఎడపల్లి మండలం ఏఆర్పీ క్యాంపు శివారులోని కెనాల్‌లో దొరికిక బాలిక మృతదేహం కేసును పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీపీ సాయిచైతన్య వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంపు శివారులోని నిజాంసాగర్ డీ 46 కెనాల్‌లో ఇటీవల ఓ బాలిక మృతదేహం దొరికింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మూడు టీంలు నిందితుల కోసం దర్యాప్తు చేపట్టారు. బాలికను మహారాష్ట్రలోని ముఖేడ్‌కు చెందిన ప్రాచి కొండమంగలేగా గుర్తించారు. దీంతో పోలీసులు అక్కడకు వెళ్లి వివరాలు సేకరించారు. బాలికను కన్న తండ్రే హతమార్చినట్లు గుర్తించారు. ముఖేడ్ తాలూకాలోని కెరుర్ గ్రామానికి చెందిన కొండమంగలే పాండురంగ సెలూన్ నడుపుతూ భార్య ముగ్గురు పిల్లలతో ముఖేడ్‌లో జీవిస్తున్నాడు. అయితే రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కెరుర్ సర్పంచ్‌గా పోటీ చేయాలనే భావించాడు. అయితే ముగ్గురు పిల్లలు ఉండడంతో పోటీకి అనర్హుడిని అవుతానని అనుకున్నాడు. దీంతో ప్రస్తుత సర్పంచ్ షిండే గణేశ్‌తో కలిసి పథకం వేశారు. ముగ్గురు పిల్లల్లో బాబుని ఎవరికైనా దత్తత ఇవ్వాలని అనుకున్నారు. కానీ అప్పటికే అతని పేరు మీద బర్త్ సర్టిఫికెట్ ఉందని నిర్ధారించు

కున్నారు. దీనికి గాను పుణె కార్పొరేషన్ ఆఫీసు వెళ్లి బర్త్ సర్టిఫికెట్ మార్చాలని ప్రయత్నం చేశారు. కానీ బర్త్ సర్టిఫికెట్ మారదని తెలిసిన తరువాత.. ముగ్గురు పిల్లల్లో ఒకరిని చంపేసి తప్పిపోయినట్లు ప్రచారం చేయాలని పథకం రచించారు. ఇందులో భాగంగా పెద్ద కూతురు ప్రాచీని అతని తండ్రి తన బైక్‌పై ఎక్కించుకుని వచ్చి నిజామాబాద్ జిల్లాలోని ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంపు శివారులోని నిజాంసాగర్ డీ 46 కెనాల్‌లో బాలికను తోసేశాడు. దీంతో చిన్నారి మృతి చెందింది. కేసును చాకచక్యంగా ఛేదించిన బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు, ఎస్సైలు రమ, చంద్రమోహన్, ఏఎస్సై బాబురావు, కానిస్టేబుళ్లు సుధీర్, శ్రీకాంత్‌లను సీపీ అభినందించారు.

గెలిపించండి అభివృద్ధి చేస్తా..

అక్షరటుడే, ఇందూరు: తను గెలిపిస్తే వార్డును అభివృద్ధి చేసి చూపిస్తానని 28వ డివిజన్ బీజేపీ అభ్యర్థి మల్కయ్య మహేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని గాజుల్ పేట్‌లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, గెలిపిస్తే పరిష్కారం దిశగా అడుగులు వేస్తానన్నారు. డివిజన్ వాసులు బీజేపీని ఆదరించి గెలిపించాలని కోరారు.

సాగునీటి పంపు సెట్లకు కెపాసిటర్లు తప్పనిసరి

అక్షరటుడే, భీమ్‌గల్: సాగునీటి పంపు సెట్లకు తప్పనిసరిగా కెపాసిటర్లు అమర్చుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు సూచించారు. ఆర్మూర్ డివిజన్ పరిధిలోని బడా భీమ్‌గల్‌లో సోమవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 'పల్లెబాట' భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, సాగునీటి పంపు సెట్లకు కెపాసిటర్లు అమర్చుకోవడం తప్పనిసరి అని తెలిపారు. అలాగే మోటార్ల లోడును 5 హెచ్‌పీ నుంచి 7.5 హెచ్‌పీ వరకు క్రమబద్ధీకరించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి రాచకొండ విష్ణువర్ధని, ఉపసర్పంచ్ రాచకొండ శంకర్ గౌడ్, గ్రామ కార్యదర్శి రజిత, గ్రామ కమిటీ అధ్యక్షుడు మోర్తాడ్ లింబాద్రి, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శిశుమందిర్‌లో కానిస్టేబుల్ సౌమ్యకు ఘననివాళి

అక్షరటుడే, భీమ్‌గల్: గంజాయి అక్రమ రవాణా కేసు దర్యాప్తులో భాగంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్యకు శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. సోమవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సంతాప సభలో సౌమ్య ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సౌమ్య మరణం బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు రంగంలోకి దిగారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు కాలనీల్లో తిరుగుతూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆర్మూర్ పట్టణంలోని పలువురు అభ్యర్థులు స్థానిక సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు.
– అక్షరటుడే, ఆర్మూర్

వార్డుల్లో అభ్యర్థుల సందడి..

- కాలనీల్లో పనులు చేయిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం
- రోజంతా వార్డులకే పరిమితం

ఆర్మూర్ పట్టణంలో పలువురు అభ్యర్థులు ఆయా వార్డులపై దృష్టి కేంద్రీకరించారు. నామినేషన్లు వేసిన పలువురు పార్టీ బీ ఫాం కోసం ఎదురు చూస్తున్నారు. బీ-ఫాంలు ఇవ్వకపోయినప్పటికీ తమకే టికెట్ వస్తుందన్న ఆశతో పలువురు ఇప్పటికే వార్డుల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌తో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నంలో ఉన్నారు.

వార్డులకే పరిమితమై..

అభ్యర్థులు రోజంతా ఆయా వార్డుల్లోనే తిరుగుతూ ప్రజలతో మమేకమవుతున్నారు. తాము గెలిస్తే వార్డులను అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇస్తూ మద్దతు కోరుతున్నారు. కాలనీ పెద్దలు, అభివృద్ధి కమిటీలు, యువతను కలుస్తూ మద్దతు తెలపాలని కోరుతున్నారు.

అభివృద్ధి పనుల హడావుడి..

పట్టణంలో మొత్తం 36 వార్డులు ఉన్నాయి. ప్రధాన పార్టీల నాయకులు కాలనీల్లో రోడ్లు, మురికికాలువల శుభ్రత, మరమ్మతుల పనులు చేయిస్తున్నారు. మున్సిపల్ పారిశుధ్య సిబ్బందిని రప్పించి స్వయంగా పర్యవేక్షణ చేపడుతున్నారు. ప్రైవేట్ ట్రాక్టర్లతో రోడ్లను చదును చేస్తున్నారు.ఇదిలా ఉండగా, గతంలో పట్టణాభివృద్ధికి మంజూరైన రూ.18 కోట్ల నిధులతో ఆయా వార్డుల్లో సీసీ, బీటీ రోడ్లు, కల్వర్టులు, మురికికాలువల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులనూ అభ్యర్థులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.



కాలనీల్లో కోలాహలం

ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నప్పటికీ గతంలో కాలనీల బాగోగులు పట్టించుకోని నేతలు సైతం ఇప్పుడు కాలనీల్లో కనిపిస్తున్నారు. అలాగే పలువురు యువకులు సైతం నామినేషన్లు దాఖలు చేశారు. వివిధ పార్టీల నేతలు, అభ్యర్థులతో కాలనీలు కోలాహలంగా మారాయి. ఎన్నికల ముందు కనిపిస్తున్న ఈ ఉత్సాహం గెలుపు తర్వాత కూడా కొనసాగితేనే అభివృద్ధి సాధ్యమని ఓటర్లు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల సమయంలోనే కాకుండా నిరంతరం కాలనీల అభివృద్ధిపై ఇదే శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

సీఎం కప్ క్రీడల్లో మెరిసిన రెంజర్ల పాఠశాల విద్యార్థులు

అక్షరటుడే, ముప్కాల్: రెంజర్ల ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించారు. వివిధ క్రీడా విభాగాల్లో ప్రతిభ చాటి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించగా సర్పంచ్ బొమ్మెన లావణ్య, ఉపసర్పంచ్ రాజేందర్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ఉత్తేజపర్చి వారిలో ప్రతిభను వెలికితీసేందుకు సీఎం కప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఎం రవి మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ చూపడం పాఠశాలకు గర్వకారణమన్నారు. ఉపాధ్యాయ బృందం కూడా విద్యార్థులను ప్రోత్సహిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

నగరంలోని 22వ డివిజన్ అభివృద్ధికి పాటుపడతా..

అక్షరటుడే, ఇందూరు: నగరంలోని 22వ డివిజన్ అభివృద్ధికి పాటుపడతానని బీజేపీ అభ్యర్థిని పుల్లం వైష్ణవి సుధా అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా సోమవారం వార్డులో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులోని సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని వివరించారు. అలాగే అభివృద్ధి పనుల కోసం నిధుల మంజూరు చేయించడంతో పాటు పనులు శరవేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. తనకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుంకినిలో ప్రత్యేక పశువైద్య శిబిరం

అక్షరటుడే, కోటగిరి: పోతంగల్ మండలంలోని సుంకినిలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్య కళాశాల కోరుట్ల, పశు సంవర్ధక శాఖ, లయన్స్ క్లబ్ బోధన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సర్పంచ్ షాజీ పటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత్, లయన్స్ క్లబ్ ప్రతినిధి హనుమంత్ రావు ప్రారంభించారు. శిబిరంలో భాగంగా వివిధ వైద్య నిపుణుల సమక్షంలో పశువులకు అనేక రకాల జబ్బులు, ఆరోగ్య సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. పశువులు, జీవాలకు నట్టల నివారణ కోసం మందులు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు జయశ్రీ, స్రవంతి, విశాల్, సాయి చరిత, పోతంగల్ మండల పశువైద్యాధికారి సురేష్, జూనియర్ వెటర్నరీ డాక్టర్లు, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ సుధీర్, గోపాల మిత్ర సాయిలు పాల్గొన్నారు.

గగ్గుపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

అక్షరటుడే, ఆర్మూర్: ఆలూర్ మండలం గగ్గుపల్లి గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వినయ్ ఆదేశాల మేరకు సర్పంచ్ కొండి నడ్పి గంగాధర్ ఆధ్వర్యంలో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో మౌలిక వసతులను బలోపేతం చేసే దిశగా కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాత గంగామణి, వార్డు మెంబర్ ఆకాష్ శెట్టి, మార్కంటి మల్లేష్, గ్రామ కార్యదర్శి కిషోర్, నాయకులు పోతరాజు, గంగాధర్, మదరి శంకర్, మదరి రాణి, తెడ్డు సాయమ్మ, రాస అజిత్, దయాకర్, సూరజ్, రాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఐదో డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తా..: యాదాల నరేశ్

అక్షరటుడే, ఇందూరు : నగరంలోని ఐదో డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ అభ్యర్థి యాదాల నరేశ్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా సోమవారం డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వార్డు అభివృద్ధికి చేపట్టే పనులను వివరించారు. ఐదో వార్డు ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. స్థానిక నాయకుడిగా ఇక్కడి ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. అందరికీ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని చెప్పారు. తనను కార్పొరేటర్ గా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

క్రీడా మైదానం ప్రారంభం

అక్షరటుడే, లింగంపేట : మండల కేంద్రంలో నిర్మించిన క్రికెట్ మైదానాన్ని సోమవారం ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత, లింగంపేట సర్పంచ్ కౌడా రవిలు ప్రారంభించారు. రైతువేదిక సమీపంలోని ఖాళీస్థలాన్ని దాతల సహకారంతో క్రీడామైదానంగా మార్చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల నుంచి లింగంపేట్‌లో యువకులు క్రికెట్ ఆడడానికి అనువైన స్థలం లేకపోవడంతో ఈ స్థలాన్ని గుర్తించి లింగంపేట మాజీ సర్పంచ్ అప్రోజ్, పీసీసీ మైనార్టీ కార్యదర్శి రఫీయొద్దీన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుర్ర నారా గౌడ్, ఉప సర్పంచ్ ప్రసాద్ గౌడ్ సహకారంతో క్రీడా మైదానాన్ని నిర్మించారు. లింగంపేట్‌లో క్రికెట్ ఆడడానికి దాతలను సంప్రదించి మైదానాన్ని నిర్మాణం చేపడంతో లింగంపేట ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. యువకులు క్రీడల్లో రాణించాలని కోరారు. అనంతరం రెండు జట్ల మధ్య నిర్వహించిన క్రికెట్ రసవత్తరంగా కొనసాగింది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలి

అక్షరటుడే, బాన్సువాడ: ఇటీవల మృతి చెందిన విద్యార్థిని సంగీత కుటుంబానికి రూ.50లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం బాన్సువాడ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలం బోర్లం క్యాంప్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సునీత వల్లే 8వ తరగతి విద్యార్థిని సంగీత మృతి చెందిందని వారు ఆరోపించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ విద్యార్థినులను సొంత పనులకు వాడుకోవడం అన్యాయమని మండిపడ్డారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాలరాజ్, డీఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జీవన్ రాథోడ్, బీసీ విద్యార్థి సంఘం డివిజన్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, నాయకులు అశోక్, మోచి నరేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

భీమ్‌గల్, అక్షరటుడే: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కర్నె సత్యగంగయ్య సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సునీల్ కుమార్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముత్యాల సునీల్ కుమార్ మాట్లాడుతూ.. రాబోయే మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి భారీగా చేరికలు సాగుతున్నాయని తెలిపారు. భీమ్‌గల్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంచిలో మృతదేహం కలకలం

అక్షరటుడే, కామారెడ్డి : కామారెడ్డి పట్టణంలో సంచిలో వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన కలకలం రేపింది. సగం మృతదేహాన్ని దుండగులు కట్టి చెత్తకుప్పలో పడేశారు. పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని సీఎస్ఐ చర్చి సమీపంలోని చెత్త కుప్పలో చెత్త కాగితాలు ఏరుకునే వారికి గోనె సంచిలో నుంచి కాళ్లు కనిపించాయి. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గోనె సంచిని తెరిచి పరిశీలించగా.. నడుం నుంచి కాళ్ల వరకు మాత్రమే ఉన్న సగం మృతదేహం లభించింది. మృతదేహంలోని మిగతా భాగం కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినప్పటికీ లభించలేదని పోలీసులు తెలిపారు. మృతదేహం సగం మాత్రమే ఉండడంతో మృతుడు ఎవరో గుర్తించడం కష్టంగా మారిందన్నారు. రెండు మూడు రోజుల క్రితమే హత్య చేసి, మృతదేహాన్ని ముక్కలుగా కోసి గోనె సంచిలో కట్టి ఇక్కడ పడేసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

రైలు నుంచి జారిపడి ఒకరి దుర్మరణం

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: రైలు నుంచి పడిపోయి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నిజామాబాద్ - డిచ్‌పల్లి మధ్య చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను రైల్వే ఎస్సై సాయిరెడ్డి సోమవారం వెల్లడించారు. నిజామాబాద్ - డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. రైలు నుంచి ఓ ప్రయాణిస్తూ జారికిందపడ్డట్లుగా గుర్తించారు. ఈ క్రమంలో తీవ్రగాయాలపాలైన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. రైలులో నుంచి జారి పడి మృతి చెందిన వ్యక్తి వయస్సు 40-45 ఏళ్ల మధ్య ఉండవచ్చని.. అతడిని గుర్తించేందుకు ఇతర ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై రైల్వే హెడ్ కానిస్టేబుల్ హన్మాండ్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించామన్నారు. సమాచారం నిమిత్తం 8712658591లో సంప్రదించాలని కోరారు.

భీమ్‌గల్‌లోని 9వ వార్డు అభివృద్ధికి కృషిచేస్తాం

అక్షరటుడే , భీమ్‌గల్ : భీమ్‌గల్ మున్సిపాలిటీలోని 9వ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని కాంగ్రెస్ అభ్యర్థి మల్లెల రాజశ్రీ లక్ష్మణ్ పేర్కొన్నారు. వార్డు పరిధిలో సోమవారం ముమ్మరంగా ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలుస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ 'హస్తం' గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. గతంలో తాను కౌన్సిలర్‌గా, మున్సిపల్ ఛైర్మన్‌గా పనిచేసిన అనుభవంతో వార్డులో నెలకొన్న సమస్యలపై పూర్తి అవగాహన ఉందని రాజశ్రీ తెలిపారు. గత హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను గుర్తు చేస్తూ, మరోసారి అవకాశం ఇస్తే వార్డు రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు. స్థానికురాలిగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, డ్రెయినేజీ, తాగునీరు వంటి కనీస సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున, అధికార పార్టీ అభ్యర్థులను గెలిపిస్తేనే నిధుల రాక సులువవుతుందని వివరించారు.